కథానిక

# సౌమిత్రి విద్యార్థిదశ

మన్నవ గిరిధరరావు

సౌమిత్రి కాలేజీలో చేరటంకోసం వచ్చినపుడు అతనిలో అన్ని సౌమ్యలక్షణాలు స్ఫుటంగా కనబడ్డాయి. ఇంత సుశీలుడు కాలేజి ప్రతిష్ఠను పదిరెట్లో ఇరవైరెట్లో హెచ్చవేసి తీరుతాడనిపించింది. అప్పుడే బస్సుదిగి కిళ్ళీకొట్లవారినీ, రిక్షాలాగేవారినీ అడిగి కాలేజికి ఎటుపోవాలో తెలుసుకున్నాడు. వచ్చివచ్చి ఒక పెద్ద విద్యాలయంలో ప్రవేశించి దాని ఆఫీసుదగ్గరకు వెళ్ళాడు. అక్కడ తనయీడు పిల్లలు చాలమంది వున్నారు. కిటికీదగ్గరకువెళ్ళి "ఒకదరఖాస్తుఫారం ఇస్తారూ" అని అడిగాడు. "ఏమిఫారమయ్యా?" అని ఎదురుప్రశ్న వినపడింది. "కాలేజిలో చేరటానికి" అన్నాడు. "ఇది కాలేజికాదు ఇది హైస్కూలు. అదుగో ఆ ఎడమప్రక్కన వున్నదే కాలేజి. అటు వెళ్ళండి"అని సమాధానం వచ్చింది. "ఇంత పెద్దభవనం హైస్కూలా! మరి కాలేజి ఏదీ? ఆ భవనమా? ఏదో యూనివర్శిటీలాగ వున్నదే! సరేకానీ" అని అనుకుంటూ కాలేజిలోకి వెళ్ళాడు. తను చదివివచ్చిన పూరిపాక హైస్కూలును కాలేజితో పోల్చి చూచుకుంటే ఎప్పుడో చదివిన లిల్లిపుట్ ఐలండ్ గుర్తుకు వచ్చింది.

సౌమిత్రి స్వరూపంగూడ పరిచయం చేయటం అవసరమని తోస్తుంది. భారతదేశపు సగటు కుటుంబంలో జన్మించటం వలన జీవితంలో ఆదినుంచి అంతవరకు ఏటికి ఎదురీదటమే అతని కర్తవ్య మయింది. భారతదేశం అనగానే అందరికీ స్ఫురణకువచ్చే వ్యవసాయం అతని వారసత్వం. స్వగ్రామంలో హైస్కూలు పెట్టబడిన అదృష్టంవలన, సౌమిత్రి సహజంగా కర్తవ్యనిర్వహణ గుర్తించినవాడు కావటం వలన. హైస్కూలు విద్యాభ్యాసం ఎక్కడా గాట్లుపడకుండానే పూర్తిఅయింది. అంతటితో చదువుకు మంగళహారతి చెప్పబడేదే. చెప్పుకోదగ్గమార్కులు రావటంవలన తల తాకట్టుపెట్టి అయినా సౌమిత్రిని ఇంటరు చదివించాలని తండ్రి నిర్ణయించుకున్నాడు. కమ్మని గేదెపెరుగు చివరిసారి రుచిచూచి తల్లిదండ్రుల అనంతమైన ప్రేమను అమాయకంగా స్వీకరించి బస్సులో బయలుదేరాడు. గుండీలులేని పొట్టిచేతుల చొక్కా బొందుల నిక్కరు, కాళ్ళకు టైరుచెప్పులతో సౌమిత్రి కళాశాలలో అడుగు పెట్టాడు.

సాధారణంగా ఆఫీసుల్లో వుండేవారు అడగంగానే సమాధానమివ్వరు. అలా సమాధానం చెపితే ఏమీపనిలేక కూర్చున్నాడని మనం అనుకొంటామని వాళ్ళభయం. ఒక ఐదు నిముషాలైనా ప్రతిమలాగ నిలబడి తిరిగి అదే ప్రశ్నను అడిగితే అపుడు మనకు అంతుపట్టని మాటల్లో ముక్తసరిగా ప్రత్యుత్తరం వస్తుంది. అది మన ప్రశ్నకు చెందిన సమాధానమో. తనలో తాను గొణుగుకొనటమో, లేక ప్రక్కనున్న జవానుకు ఆజ్ఞలివ్వటమో అర్థమవక మూడవసారి అడగటానికి మనమే వెనుకంజ వేస్తాం. ఒకవేళ ధైర్యంచేసి మూడవసారి మనం అదే ప్రశ్నవేస్తే ఒక సింహగర్జనలాంటి, లేదా ఆటమిక్ ఎక్స్‌ప్లోజన్‌లాంటి ధ్వనితో మనల్ని ఒక చెవిటివానిక్రింద జమకడుతూ "అవతలి కిటికీ దగ్గర అడుగు"అని ధీమాతోగూడిన ప్రత్యుత్తరం వస్తుంది. అవతల కిటికీలు ఐదారువుంటే ఏ కిటికీయో తెలియక అందరినీ అడిగి కాదనిపించుకో వలసివస్తుంది. ఇంటిదగ్గర బయలుదేరేటప్పుడు ఏ గండుపిల్లి ఎదురువచ్చిందోనని సింహావలోకంచేసుకుంటూ వెలుపలికివస్తాము. జేబులో చిల్లరడబ్బులు గలగలలాడిస్తేతప్ప ఆఫీసుజవానులైనా వళ్ళుదగ్గర వుంచుకొని కావలసినవిషయం చెబుతారనటానికి ఆస్కారంవుండదు.

సౌమిత్రి ఈ పాట్లన్నీ పడలేదు. ఎందువల్లనంటే ఇతను చూచిన ఆఫీసు హైతరగతికి చెందినదికాదు. అసలుఅలాంటిది అవునోకాదో తెలుసు

కోటానికైనా ఒక అధికారిని కలుసుకోటానికి అవసరమైనకనీసపు ధైర్యమైనా సౌమిత్రికివుంటేగా తనవలె కాలేజీలో చేరటానికివచ్చిన అసంఖ్యాకులైన యువకులున్నారుగనుక గొర్రెదాటు మాదిరిగా ఇతరులంతా ఎక్కడ ఏపనిచేస్తే మనమిత్రుడు గూడ ఆ పని చేసి, దరఖాస్తుఫారం తీసుకొని తప్పులులేకుండా దాన్ని పూర్తిచేసి జీతంచెల్లించి వెలుపలికివచ్చాడు టెస్టుట్యూబుల్లో రంగురంగు నీళ్లు తయారుచేయాలనిగాని, సోనోమీటరుదగ్గర కూర్చొని "వీణ"వాయించాలనిగాని ఎలాంటి అభిలాష లేకపోయినా, తెలివిగలవాళ్ళంతా లెక్కలగ్రూప్ తీసుకుంటారుగనక ఎం. పి. సి. తీసుకోనకపోతే తెలివితక్కువవాడిక్రింద జమకట్టబడుతాననే భీతివలన సౌమిత్రి ఆ గ్రూప్ తీసుకున్నాడు.

కాలేజిసీటు ఇంత సునాయాసంగావచ్చి పైన పడిందిగనుక ఏ అరండల్‌పేటలోనో ఇళ్ళుకట్టుకున్నవారంతావచ్చి తిరుపతి రైలుస్టేషనులో మాదిరిగా, మా గదిలో అద్దెకుండమంటే మా గదిలో వుండమని ప్రాధేయపడరనుకున్నాడు. అలా ఎవరూవచ్చి సౌమిత్రిని పిలుచుకొనిపోనూ లేదు. పోనీ ఫలానావీధిలో ఫలానా మేడమీద విద్యార్థులకోసం గదులు ఖాళీగావుంచారని ఎవరూ చెప్పనైనాలేదు. నగరంలో ఒకవైపు ఎంప్లాయిమెంటు ఎక్చేంజివుండి నిరుద్యోగులకు అనంతమైన సేవచేస్తున్నట్లు నగరంలో ఎచ్చటనైనా టూ-లెట్ ఎక్చేంజిగూడా ఒకటివుండి గదులు లేనివారికి గదులు సమకూరుస్తుందేమోనని వాకబు చేశాడు. అలాంటిపుణ్యం ఎవరికీ అవసరంలేదో ఏమో మరి! అటువంటి కార్యాలయం ఎక్కడా లేదని తెలిసింది.

ఏంచేస్తాడుమరి! కాలికి బలపం కట్టుకొని వూరంతా గాలించాడు. రెండురోజులు కాలేజికి సెలవుపెట్టి ఆనాడు హనుమంతుడు జానకీదేవిని అన్వేషించినట్లుగా మనమిత్రుడు చదువుకోటానికి పనికివచ్చే గదికోసం నగరమంతా అన్వేషించాడు. తిరగగా నమూనాగది ఒకటి గాలానికి చిక్కింది. కాలకృత్యాలకూ, స్నానంచేయటానికీ ఆతనిపాట్లు అతనేపడాలి. దగ్గరలో రైల్వేస్టేషనువుండటంవలన అందరి ఆస్థి అయిన రైలుపెట్టెల్లోకివెళ్ళిరావచ్చు. ఈ సంవత్సరం వర్షాలు అసలులు కురవవు. ఒకవేళ కురిస్తే గదిలో కావలసినంత నీరు. ఆనాడు పుస్తకాలు, సామాను ఒక గుట్టగాపెట్టి ఛత్రంతో వాటి సంరక్షణకు పూనుకోవాలి. గదికిటికీ అనే పేరుగల ఒకేఒక రంధ్రం వున్నది కాని అంతకంటె పెద్ద కిటికీగాని, కిటికీలుగాని వుండటం శ్రేయస్కరంకాదు. ఎందువల్లనంటే ఆగది ఒకానొక పేరుపొందిన కాఫీ హోటలుయొక్క వెనుకభాగంలో నిర్మించబడివున్నది. ఆ సౌమిత్రికి అంతకంటె మరుగైన గది లభ్యంకాకపోవటంవలన "తాత్కాలికం"గా ఆ గదినే తన చిరునామాగా ఒప్పుకున్నాడు.

ఇకపోతే భోజనవిషయం. అందరి మాదిరిగానే కొత్తలో బల్లలముందు కూర్చొని మూడునాలుగు పదార్థాలు పెరుగుతోసహా వెళ్ళిన సమయానికి తినిరావటం హుషారుగానే వున్నది. ఈ నూతనత్వంలోని మాధుర్యం హోటళ్ళలో మూడునాళ్ల ముచ్చటే అయింది. అప్పటికీ టిక్కెట్టుపుస్తకం అయిపోగానే సౌమిత్రి హోటలును గూడ మార్చివేస్తున్నాడు. నగరంలో చాలా విద్యాలయాలకు హాస్టల్సు లేకపోవటంతో "ఎలా పెట్టినా, ఏమిపెట్టినా, ఎపుడుపెట్టినా విద్యార్థులు తింటారు, తినక తప్పదు" అని హోటలు యజమానులు గుర్తించారు. పెరుగనే పేరుగల చిక్కని మజ్జిగ, మజ్జిగనే పేరుగల తెల్లనినీళ్ళు, నీళ్లనే పేరుగల జీవములుగల ద్రవం, హోటళ్లలో ఇవ్వటం పరిపాటి. అన్ని వ్యాపారాలకు ఈమధ్య ఆర్థికమాంద్యం వచ్చింది కాని భోజన హోటల్ వ్యాపారం మాత్రం నిర్విఘ్నంగా కొనసాగుతునే వున్నది. ఎటుతిరిగీ విద్యాభ్యాసం కొరకు పట్టణానికి విచ్చేసిన మన మిత్రుడు చదువుమీదగల ఆపేక్ష కొద్దీ కష్టనష్టాలను లెక్కచేయకుండా హోటల్‌మీద సమ్మె కట్టాలని లోలోపల అనిపిస్తున్నప్పటికీ చేయగలిగిందేమీ లేకపోవటంవలన అలాగే ఒక వితంతు భోజనశాలలో ఆహారం పుచ్చుకుంటూ కళాశాలకు నిర్ణీతసమయానికే చేరుకుంటున్నాడు.

పెరుగుతో భోజనం చేయటమే కారణమో, లేక మేడమీదికి మలయమారుతం ప్రవేశించి మత్తు పదార్థాన్ని విసరటమే కారణమోగాని సౌమిత్రి నిద్రపోకుండా వినిన పాఠాలను వ్రేళ్లమీద

లెక్క పెట్టవచ్చు. వీనికి బాధ్యత పూర్తిగా అతనిది కాదు. క్రింది తరగతిలో అన్నీ తెలుగులో నేర్చుకొనటంవలన, ఇపుడు ప్రతి ఉపన్యాసము ఇంగ్లీషులో వినపడేవాక్యం ఎకాఎకీన మెదడులో ప్రవేశింపదు. మొదట చెవుద్వారా తలలోకి ప్రవేశించి అక్కడ ఒకానొక ట్రాన్సులేటరు ద్వారా తెలుగులోకి అనువదింపబడి అపుడు మనస్సు దానిని అర్థం చేసుకుంటుంది. ఇలా సౌమిత్రి ఒక వాక్యం అర్థం చేసుకొనేసరికి లెక్చరర్ రెండు, మూడువాక్యాలు పూర్తిచేసి నాలుగో వాక్యం చెపుతాడు. రెండు, మూడువాక్యాలు మనస్సులోకి ప్రవేశించకుండా నాలుగోవాక్యం వినటంవలన అది అర్థం కాదు. ఈ నాలుగోవాక్యం **Merchant of Venice** లో **Portia entered the court** అని వున్నదనుకోండి, కథలో చెప్పబడే కోర్టుగురించి, పోర్షియాను గూర్చి ఏమీ తెలియకపోవటం వలన జిల్లాకోర్టు మునిసిపల్ తగాదాలు, ఇంజక్షన్ ఆర్డర్లు, యాంటీ ఇంజక్షన్ ఆర్డర్లు గుర్తుకువస్తాయి. తిరిగి ఉపన్యాసంలోని ఎనిమిదోవాక్యం **Portia exchanged the ring with Bassanio** అని వినపడంగానే ఈ బసానియో అనేవాడు మానవుడో దానవుడో తెలియదు. కనుక ఉంగరం మార్చుకొనటం మాత్రమే వినపడి సౌమిత్రి తన జీవితంలో ఉంగరం మార్చుకున్న సన్నివేశాలను వాటితదనంతర ఫలితాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందమో విచారమో పడుతూంటాడు. ఇలా వాక్యాలలో వినపడే శబ్దాలకు ఆ సందర్భాన్ని బట్టి ఉండవలసిన అర్థంకాక సౌమిత్రి అనుభవంలోని మరొక విశిష్టమైన అర్థం స్ఫురణకువచ్చి, దాన్నిగూర్చి దానికి చెందిన ఇతర విషయాలను గూర్చి అతను ఆలోచించేవాడు.

ఈ కారణాలవలన మొదట లెక్చరరు కనపడి ఉపన్యాసమూ వినపడిన సౌమిత్రికి కొలది నిముషాలు గడిచేసరికి చెంపల క్రిందకి చేతులు వస్తాయి. ఈస్థితి శాశ్వతంగా వుంటుంది. మరికొంత సేపటికీ ముందు బెంచీలోని మిత్రుని చాటుచేసుకొని సర్దుకునికూర్చుంటాడు. బహుశా విజ్ఞానచంద్రికలు నేతుగావచ్చి మీదపడితే దాని భరింపలేనని భయమేమో! ఇప్పుడుప్రమాదవశాత్తు కునుకు వచ్చినా అపాయం వుండదని ధైర్యం కలుగుతుంది. మరికొంతసేపటికి ఉపన్యాసం వినటమే ముఖ్యంగాని ఉపన్యాసకుని చూడకపోతే మటుకు మునుగిపోయిన దేమిటిలెమ్మని ఉన్నత భావం కలుగుతుంది. ఈ వాదం సౌమిత్రికి త్వరలోనే రానున్న కునుకుపాట్లను పూర్తిగా సమర్థిస్తుంది. కళ్లు మూసినా చెవులు తెరిచేవున్నాయి గదా! కనుక ఈ దశలో ఉపన్యాసం వినపడుతుందేగాని ఉపన్యాసకుడు కనపడడు. తరువాత దశలో మనస్సు చెవులు అందించే వాక్యాల పూర్తి అర్థం గుర్తించక అందులో చెదురుగా వినవచ్చే మాటలను ఆధారంగా చేసుకొని కొన్ని స్వప్నాలను సృష్టించుకుంటుంది. ఉదాహరణకు ఎలెక్ట్రిక్ బెల్ నిర్మాణాన్ని గురించి ఫిజిక్సు లెక్చరర్ చెపుతుంటే సౌమిత్రికి తన సైకిలుకు బెల్ లేకపోవటం, పోలీసు సైకిలు లాక్కుని కేస్ పెట్టటము, బెంచికోర్టులో రెండు రూపాయలు బిల్లు చెల్లించి బయటపడటం స్వప్నం వచ్చిమజాలోనున్నపుడు సౌమిత్రికి గమనాభినుండి గీయబడిన లంబరేఖ పీఠంలోనుండి వెలుపల పడటంవలన గాలివానవచ్చి చెట్టు విరిగిపడినట్లు మనమిత్రుని ఊర్ధ్వశరీరభాగం ప్రక్కవానిమీదపడే ప్రమాదం వైకల్పికం.

ఈ ట్రాన్స్‌లేషన్ వ్యవహారం లేకుండా ఇంగ్లీషువ్యాక్యం సరాసరి మనస్సులో ప్రవేశించటానికి తగినంత అనుభవం వచ్చేసరికి ముచ్చటగా మూడు నెలలయినా పట్టుతుంది. ఉపన్యాసాలను అర్థం చేసుకొనటం అనేది రెండవ టరమ్‌లో ఆరంభమైనా అప్పటికి అదృష్టమే. వాటిని శ్రద్ధతో చదవటం, జ్ఞాపకముంచుకొనటం మొదలయిన సుగుణాలన్నీ తరువాత వస్తాయి. ఈలోపల లభించిన సహవాసం చెప్పుకొనదగినదైతే ఎలాంటి ఆశలు పెట్టుకొనవసరం లేదు. హెచ్చవేస్తాడనుకొన్న ప్రతిష్టను భాగారించి తీరుతాడు. ఇందంతా మొదటి మూడు నెలల చరిత్రలో ముఖ్యవిషయాలు. సౌమిత్రి భవిష్యత్తునుగూర్చి లాబీవర్గాలు అప్పుడే ఏమిచెప్పలేక పోతున్నాయి.